# సుడిగాలిలో కాగితం ముక్క

రానురాను రవి విషయం మరీ అధ్వాన్నమై పోయింది.

నేను ప్రతిరోజూ మౌనంగా వాణ్ని పరిశీలిస్తూనే వున్నాను. ఏదో మార్పు వానిలో చాలా వేగంగా, బలంగా ముంచుకొస్తోంది. రోజు రోజుకు చెదలుతిన్న కర్రలా ఐపోతున్నాడు మనిషి.

"మీ కెప్పుడూ మీ ఆస్పిటలూ, క్లినిక్కూ, ప్రాక్టీసూ తప్పితే యింటి విషయాలను పట్టించుకోరు. యింటిదగ్గర పిల్లలేమైపోతున్నారూ, వాళ్లు ఎక్కడెక్కడ తిరుగుతున్నారూ. ఏలా వుంటున్నారూ,...యీవేవీ మీ కవసరంలేదు. పేరుకేమో పెద్ద సైకియాట్రిస్ట్....యింట్లోని మనుషులనే అర్ధంచేసుకోలేరు." యిదే యివ్వాళ ఉదయం లేస్తూ నేను మాఆవిడ నుంచి విన్న దండకం.

జానకి యీ వారం పది రోజులనుంచి రవి విషయం పదేపదే చెప్తునే వుంది నాతో.

"వాడీ మధ్య అదోలా. కొక్కుపట్టిన కోడిలా వుంటున్నాడు. ఎటో నిశ్శబ్దంగా దిక్కులు చూస్తున్నాడు. రెండుమూడు సార్లు పిలిస్తే గాని పలకడంలేదు. తిండికూడా సరిగ్గా తినడంలేదు. నా కెందుకో వాణ్ని చూస్తుంటే కడుపు తరుక్కు పోతోంది," అంది జానకి.

నిజానికి రవికి జానకి చెప్పిన లక్షణాలేవీ వుండటానికి వీల్లేదు.

ఎందుకంటే రవిది బంగారు వయసు- రవి నాకొడుకు. పదహారేళ్లుంటాయి. ప్రస్తుతం సిటీలోని చాలామంచిదని పేరుపొంది చాలాడబ్బు వసూలుచేసే బడిలో పదవక్లాస్ చదువుతున్నాడు.

యిక మా యింటి పరిస్థితి...నేను సిటీలోని ప్రముఖ సైకియాట్రిస్ట్స్‌లో ఒకణ్ని కాబట్టి నా ప్రాక్టీస్ అమోఘంగా సాగుతోంది. ఆ లెక్కన నా జీవిత విధానం యీ దేశంలోని "ఎ క్లాస్" మనుషుల లిస్ట్ లోకి వస్తుంది.

జానకి చెప్పినట్లు నేను నా ఉద్యోగం. ప్రాక్టీసూ...వీటిలోనే మునిగి నన్ను నేను మరచిపోవడం మామూలుగా జరుగుతున్న విషయమే. కాని నేనేంచేయను. నా వృత్తి అలాంటిది. ఐతే-

యీ జానకియొక్క నిరంతర పోరాటం పడలేక—యీ రోజు సెలవుపెట్టి రవి సంగతి తేలుద్దామనుకున్నాను.

నా గదిలోని సోఫాలో కూర్చుని పైప్ వెలిగించుకుంటుండగా జానకి కాఫీ తెచ్చింది.

కప్పు తీసుకుంటూ- "వీనికి రెండుమూడు రోజులనుంచి జ్వరంగా వుందిగదూ" అన్నాను. "ఔను" అంది.

——— "ఐనా బడికి వెళ్తున్నాడా" అనడిగాను. "నేను వద్దన్నా స్కూల్‌కు పోతానని మొరాయిస్తూ వెళ్తున్నాడు."

సాధారణంగా పిల్లలు ఏమాత్రం వీలున్నా బడిని ఎగ్గొట్టేందుకు ప్రయత్నిస్తారే. వీడు ఆరోగ్యం బాగులేకున్నా బడికిపోతున్నాడా. ఎందుకో...గొణుక్కున్నాను నాకునేను.

"చదువుమీద వాడికున్న శ్రద్ధ అలాంటిది మరి" జానకి మొహంలోకి చూశాను చటుక్కున మనిషి కడిగిన అద్దంలా నిర్మలంగా వుంది.

"ఊఁ..." అని....నా ఆలోచనల్లో నేను మునిగి— "వాడు సాయంకాలం ట్యూషనుకు వెళ్తున్నాడా యీ మధ్య" అన్నాను.

"యీ మధ్యేమిటి... నిన్నకూడా వెళ్ళాడు." "ఆమె...ఆపూర్ణా దేవి దగ్గరేనా" "ఆఁ" "మరి గత రెండుమూడు నెలలనుంచి క్లాస్‌లో వీడి రాంక్ పోతోందేమిటి? వీని ప్రోగ్రెస్‌రిపోర్టు మొన్నచూచినాను... ఎందుకు" జానకి మాట్లాడలేదు.

"సరే....యిప్పుడు వాడేం జేస్తున్నాడు" "స్కూల్‌కు తయారవుతున్నట్టున్నాడు"

"వీనికి ఆరోగ్యం బాగా లేకున్నా బడికిపోవాల్సిన అవసరం ఏమేర్పడుతున్నది గొణుక్కుంటున్నాను.

"పిలవమంటారా వాణ్ని మీ దగ్గరకు" అంది జానకి.

"నో...పోనీ వాణ్ని"

జానకి నావంక చిత్రంగాచూచి ఖాళీకప్పు తీసుకుని వెళ్ళిపోయింది నా గదిలోనుంచి.

సిగరెట్టు వెలిగించుకున్నాను. రింగులు తిరుగుతున్న పొగలో నా ఆలోచనలు వలలోచేపల్లా కదులుతున్నాయి. ఓ పావుగంట గడిచింది.

నేనుచూస్తుండగానే బయటి గేట్‌దగ్గరకు స్కూల్‌వాన్ రావడం, రవి చేతిలో బాక్స్‌తో భారంగానడుస్తూవెళ్లి కూర్చోవడం. వాన్ రయ్యిన దూసుకుపోవడం జరిగిపోయింది.

మనిషికి సంస్కారం, తద్వారా మానసిక వికాసం వాని చుట్టూ వున్న పరిస్థితులూ, వాతావరణం...వీటిని బట్టి సంక్రమిస్తాయి.

మా కుటుంబంలో అందరూ బాగా చదువుకున్నవాళ్ళే. అందరూ ఎంతో వున్నత పదవులను నిర్వహించిన వాళ్ళే. మా నాన్న మెజిస్ట్రేట్.

రవి వాళ్ల అమ్మమ్మ ప్రముఖ ఆర్థోపెడిక్ డాక్టర్. వాళ్ల తాతయ్య రిటైర్డు సెక్రటరీ టు గవర్నమెంటు.

...ఈ వాతావరణంలో పెరిగిన రవికి మామూలు మనిషికైతే ఏ ఇరవై సంవత్సరాలపై బడ్డ తర్వాతనో అబ్బే సంస్కారం పదిహేను సంవత్సరాల వయసులోనే అలవడింది. చదువులో వాడెంతో చురుకుకూడా, లోకజ్ఞానంకూడా వుంది వాడికి. శారీరకంగాకూడా నిజానికి వాడికున్న వయసుకంటే పెద్దవానిలా కనిపిస్తాడు.

మానసిక శాస్త్రప్రకారం చెప్పాలంటే వానిది "ఎడోలసెన్సు ఏజ్"..

అంటే ఈ వయసులో మనిషి చిగురాకులా ప్రతి చిన్న ప్రకంపనకి చలించిపోతుంటాడు. మనసుపై దండెత్తె అనేక అనుభూతుల దండయాత్రలో నలిగిపోతూ ఊగిసలాడుతుంటాడు. కొలనులో పుట్టే అంతులేని అలలలా ఈ వయసులో భావావేశం ఎంతో తీవ్రంగా వుంటుంది.

–అయితే ..రవిలో ఈ వింత పరిణామం ఎందుకు చోటు చేసుకుంటున్నట్టు?

ఎందుకు వీడు యాసిడ్‌లో మునిగిన బంగారంలా కళాహీనమైపోతున్నాడు.

ఆలోచిస్తున్నాను. ఆలోచిస్తున్నాను – జానకి టిఫిను వడ్డించి పిలిచింది. ఆలోచిస్తూనే టిఫిను ముగించాను. సిగరెట్టు వెలిగించుకున్నాను– పయింది.

లేచి కారు తీసుకుని బయలుదేరాను రవి బడికి.

ఆ బడిలోని స్టాఫూ, ప్రిన్సిపాల్ అందరూ నాకు పరిచితులే బాగా. ప్రతి సంవత్సరమూ ఎంతో కొంత విరాళం యిస్తుంటాను నేనా పాఠశాలకు.

స్కూల్ ఆవరణలో కారాపి దిగి లోపలికి నడుస్తున్నాను.

వాతావరణం ప్రశాంతంగావుంది. ఏపుగా పెరిగిన సరుగులుచెట్లు— అశోక చెట్లు, క్రింద నేలపైన క్రోటన్స్‌తో బార్డర్—

అక్కడి గాలిలో కూడా క్రమశిక్షణ వున్నట్టనిపించింది. క్లాసులు నడుస్తున్నాయి.

పైపు వెలిగించుకుని.... చక్కగా స్టాఫ్‌రూం దిక్కు నడిచాను.

పరిచయమున్న కొందరు ఉపాధ్యాయులు లేచి నిలబడి నమస్కరించి... నేనూ ఓ పది నిమిషాలు పరామర్శచేసి కిటికీగుండా క్లాసులను గమనిస్తున్నాను. పదవక్లాసు "ఎ"—పక్కన పధవక్లాసు "బి"—

రవికూడా కనిపిస్తున్నాడు స్పష్టంగా రవినీ, వాని క్లాసునూ వివరంగా చూడగలిగేట్లు కిటికీ దగ్గర కుర్చీలో కూర్చున్నాను.

అప్పుడు రవి క్లాసులో ఎవరో సార్ పాఠం చెబుతున్నాడు రవి ముఖంనిండా ఒట్టి విర్లిప్తత వుంది. ఎంతో దీనంగా ముఖంపెట్టి ఉపాధ్యాయునివంక చూస్తూ కూర్చున్నాడు మనిషిలో అంతా శూన్యం.

యింతలో గంట మ్రోగింది. బడినిండ కలకలం. క్లాసులోంచి ఉపాధ్యాయులు మారడం, విద్యార్థులు లేచి బద్ధకంగా ఒళ్ళు విరుచుకోవడం—ఆటవిడుపులా వుంది.

లేచి చూస్తూండగానే మళ్ళీ వాతావరణం నిండా గంభీరత పులుముకుంది. క్లాసుల్లోకి కొత్త ఉపాధ్యాయులు వస్తున్నారు.

రవి క్లాసులోకి ఓ అందమైన అమ్మాయి వచ్చింది, రొమ్ములపై ఏదో పుస్తకాన్ని పట్టుకుని. ఆమె వయసు యిరవై రెండు సంవత్సరాలుంటుందేమో బహుశా. ఎంతో నాజూగ్గావుంది. వయ్యారంగా వుంది. మత్తెక్కించేలా వుంది.

ఆమె వేషధారణ కూడా ప్రత్యేకంగానే వుంది. ఓ పావుమీటర్ గుడ్డ ముక్కతో జాకెట్టు కుట్టించు కున్నట్టుంది. అదీ ఓ సన్నని పొర. ఒంటి నిగనిగలు స్పష్టంగా బయటికి చిమ్ముకొస్తున్నాయి. చీరను బొడ్డు క్రింద కట్టింది. పైటను గాలిలో ఎటో వదిలేసింది వయ్యారంగా.

ఆమె కళ్ళు...ఆమె ముఖం...ఆమె ఒళ్ళు—అంతా విషా.

పుస్తకం తెరిచింది. పాఠం చెప్పడం ప్రారంభించినట్టుంది.

''ఆ క్లాసులో వున్నామె ఎవరండీ'' అనడిగాను నాతో మాట్లాడుతున్న ఓ స్టాఫ్ మెంబర్‌ను.

అతను అటుచూచి ''మిస్ పూర్ణాదేవి అని మొన్న మొన్ననే యిక్కడ చేరింది. షి యీజ్ ఎమ్మే'' అన్నాడు.

''ఊఁ,...'' అని తలూపాను. అతను యింకేదో చెప్తున్నాడు.

రవి ముఖాన్ని గమనిస్తూ స్టడీ చేస్తున్నాను నేను. అప్పటిదాకా బొగ్గులా వాడిపోయి వున్న వాని ముఖం పూర్ణాదేవి రావడంతోనే వేయివాట్ల బల్బులా వెలిగింది సంతోషంతో.

ఆమెవంక చూస్తున్నాడు కళ్ళనిండా వెలుగుతో...దేవతవంక చూస్తున్న భక్తునిలా.

ఆమె బోర్డుపై ఏదో రాస్తోంది. ఆమె వీపుపై స్పష్టంగా కనిపించే బ్రాసరీ... క్రింద మెరిసే నడుం.... యింకా క్రింద బిగ్గరగా కట్టుకున్న చీరలో ఆకారాలు కవ్విస్తున్న పిరుదులూ—

ఆమెవంక దీక్షగా చూస్తున్నాడు రవి. పాఠం వినడం... ఆమెను చూడడంవ్చ—అసంభవం...అసంభవం.

ఆమెలో సెక్స్ వినిపిస్తున్నది. సెక్స్ కనిపిస్తున్నది. సెక్స్ ధ్వనిస్తున్నది. గమనిస్తున్నాను, గమనిస్తున్నాను. గంటయిపోయింది—

పూర్ణాదేవి వెళ్ళిపోయింది రవి క్లాసులోనుంచి...మాయమౌతున్న మెరుపులా. క్లాసు చుక్కలులేని ఆకాశంలా మిగిలిపోయి—రవిని పరిశీలిస్తున్నాను.

వాని ముఖం గాలిపోయిన రబ్బరు బుడగలా ఐంది. చూస్తున్నాడు చూపులనిండా శూన్యంతో....యిప్పుడే మొలకెత్తుతున్న మొక్కలాంటి రవి—

యింకా ప్రేమ ... శృంగారం ... మోహం... సెక్స్—అంటే ఏమిటో స్పష్టంగా తెలియని రవి—పూర్ణాదేవి ఆకర్షణలో చిక్కి—సుడిగాలిలో కాగితపు ముక్కలా ఐపోయి — పీడామె గురించి తపిస్తున్నాడా...

ఆమెను ఎందుకు ఆకలిగా చూస్తున్నాడు. ఐనా అయస్కాంత క్షేత్రంలో యినుపముక్క వున్నప్పుడు ఆకర్షించబడటం సహజమే కదా—యిందులో రవిదిఏమైనాలోపం వుందా.

వాని వికసిస్తున్న పసివయసుపై పూర్ణాదేవి శరీరం, అందం వేస్తున్న మంత్రకు లొంగిపోతున్నాడా వీడు.

ఇప్పుడు వాని కళ్ళనిండా కనిపిస్తున్నది ఆందోళన... ఆందోళన. వానికేం కావాలో...ఆమె నుంచి వాడేం కోరుకుంటున్నాడో వానికే తెలియని అంతర్ఘర్షణ.

లేచి బయటికొస్తుండగా ... రవి క్లాసులో నుంచి అవతలికి వెళ్ళిపోయి...కారు స్టార్టు చేస్తున్నాను.

రవి గ్రౌండుకు అటువేపున్న లేడీ స్టాఫ్‌రూం దగ్గర తచ్చాడుతూ కనిపించాడు.

అంటే ... మళ్ళీ పూర్ణాదేవిని చూసేందుకు తహ తహ లాడుతున్నాడన్నమాట. బయలుదేరి యింటికొచ్చాను...

సంస్కారమైన కుటుంబాలలో కొన్ని దౌర్భగ్యమైన అలవాట్లున్నాయి....యింట్లోని ప్రతివారికీ ప్రత్యేకంగా ఓ గది వుంటుంది. అవసరముంటే తప్ప ఒక గదిలోకి యింకొకరు పోరు. దాదాపు అందరికీ చిన్నప్పటినుంచే డైరీ రాసే అలవాటు వుంటుంది.

ఇంటికి వెళ్ళగానే పరాసరి రవి గదిలోకి వెళ్ళాను. డూప్లికేట్ తాళం చెవితో వాని అలమెరా తెరచి...డైరీని బయటకు తీసి....

చదవడం మొదలెట్టాను.

12-7-78

ఇవ్వాళ మా బడిలోకి కొత్త టీచర్ వచ్చింది. పేరు పూర్ణాదేవి. ఆమె ఎంత అందంగా వుందో! కాని ఆమె అందం మామూలుగాలేదు. ఆమెనుచూస్తుంటే నరాలు జివ్వుమంటున్నాయి. చూస్తున్నకొద్దీ యింకా యింకా ఆమెనే చూడాలనిపిస్తోంది. మాకు ఇంగ్లీషు చెపుతుందా టీచర్-

13_7_78

పూర్ణాదేవి టీచర్ క్లాసు ఎప్పుడొస్తుందా అని ఎదురుచూస్తుంటాను పొద్దంతా. నా మనసునిండా టీచరే నిండిపోయింది.

15_7_78

టీచరును నాకు ట్యూషన్ చెప్పమని అడిగాను. అలాగైనా టీచర్‌ను చాలాసేపు చూడొచ్చు. టీచర్ ఒప్పుకుంది. సాయంత్రం అమ్మతో చెప్పాను. అమ్మ కూడా ట్యూషన్‌కు వెళ్ళడానికి ఒప్పుకుంది. ఎంతో సంతోషంగా వుంది నాకివాళ.

16_7_78

పూర్ణా టీచరును చూడగానే నాలో ఎంతో సంతోషం వుప్పొంగు తుంది. ఆమె అప్పుడప్పుడు నన్ను ముట్టుకుంటుంది. ఆ క్షణం కరెంట్ షాక్ కొట్టినట్టు అనిపిస్తుంది. ఆమెను చూడకుంటే చచ్చిపోవా లనిపిస్తుంది. కాని నేనెందుకు యిలా ఎప్పుడూ పూర్ణా టీచరు గురించే ఆలోచిస్తున్నాను...ప్చ...ఏమో. నా సంగతి నాకే అర్థం గావడంలేదు. అంతా అయోమయంగా వుంది. పిచ్చిగా వుంది.

17_7_78

జ్వరమొచ్చింది. బడికీరోజు వెళ్ళవద్దంది అమ్మ. కాని పూర్ణా టీచరును చూడకుండా వుండగలనా? అందుకనే జ్వరంతోనైనా బడికి వెళ్ళాను. ట్యూషనుకు వెళ్ళాను. టీచర్ నన్ను తాకి చూచింది చేయితో.... ఓహ్__

18_7_78

పూర్ణా టీచర్.... పూర్ణాటీచర్.

తర్వాత పేజీలనిండా ఆమె పేరును కొన్నివేలసార్లు రాశాడు. నిట్టూర్చాను...

డైరీని మూసేశాను. నా తల రాళ్ళు నిండిన రేకు డబ్బాలా వుంది బరువుగా.

ఆ రోజు సాయంత్రం కూడా రవిని పరిశీలించాను దూరం నుంచే త్వరంతోనే ట్యూషన్‌కని వెళ్ళాడు.

రావి ఓ అరగంటలోనే నీరసంగా, మొగం వ్రేలాడేసుకుని తిరి గొచ్చాడు. వచ్చి ... "టీచర్ ఇంటికి తాళంవేసి వుంది" అని చెప్పి మంచంలో వాలిపోయాడు.

ఎవరిది తప్పు....పసిహృదయంపై ఓ వికృతమైన ముద్రవేసిన ఆమె....టీచరులా నిండుగా కనిపించక క్యాబరే డాన్సర్‌లా అంగాంగ ప్రదర్శన చేసే పూర్ణ.

ఆరాత్రి గడిచింది...ఎప్పుడో అర్థరాత్రి ఓ నిర్ణయానికొచ్చాను.

మర్నాడు రవి బడికివెళ్ళి...ప్రిన్సిపాల్‌ను కలిసి...విషయమంతా వివరంగా చెప్పి...

అతనంతా విని "మీరు చెప్పేది నిజమే. ఆమెను మా స్కూలో అపాయింట్‌చేసి పసిహృదయాలను కలుషితం చేయడము మా తప్పే... సరే ఆమె యిప్పుడు మా స్కూల్లోలేదు. రాజీనామా కాగితం పంపిం చింది నిన్న. ఆమె వుండే వార్డులోని ఓ కుర్రి గ్యాంగ్రియుమేటుతో ఆమె లేచిపోయిందట"...షాక్ తిన్నాను.

విశ్శబ్దంగా లేచి బయటి కొచ్చాను.

x x x

ఈ రోజు...

దినపత్రికను చూస్తున్నాను కళ్లనిండా నీళ్లతో.

పత్రికలో—"కనబడుటలేదు" శీర్షికక్రింద నేను వేయించిన రవి ఫొటో నవ్వుతోంది.

ఎవరితోనో పూర్ణ లేచిపోలే — తెలియనిదాన్ని— అర్థంగాని ఆకర్షణను వెదుక్కుంటూ రవి ఎటో వెళ్ళి—

కళ్లు మూసుకున్నాను భారంగా—బాధగా.